క్లుప్తంగా

ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(క్రైమ్): దర్గామిట్ట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బి.వీర వెంకటసుబ్బారావు గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ డి.హిమవతి, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. బాపట్ల జిల్లా నగరం మండలానికి చెందిన సుబ్బారావు 2007లో పోలీసుశాఖలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. 2016లో సీఐగా పదోన్నతి పొందారు. ఒంగోలులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఇటీవల రేంజ్ వీఆర్‌కు వెళ్లారు. తాజా బదిలీల్లో దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. స్టేషన్ పరిధిలోని మెరుగైన శాంతిభద్రతల కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా సుబ్బారావు తెలిపారు.

పోలీస్‌శాఖ న్యాయ సలహాదారుడి నియామకం



శ్రీనివాసులురెడ్డి (ఫైల్)

నెల్లూరు(లీగల్): పోలీసుశాఖ జిల్లా న్యాయ సలహాదారుడిగా రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ తుమాటి శ్రీనివాసులురెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు రూరల్ పరిధిలోని 28వ డివిజన్‌లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ కిట్‌లను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనలతో లబ్ధిదారులకు కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు అమ్మిన ద్రోహి సోమిరెడ్డి



మాట్లాడుతున్న తలమంచి సురేంద్రబాబు

నెల్లూరు(దర్గామిట్ట): మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నకిలీ ఎరువులు అమ్మిన ప్రజాద్రోహి అని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు దుయ్యబట్టారు. గురువారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్యాస్ ధర పెంపునకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కారణమని సోమిరెడ్డి మాట్లాడడం ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. నకిలీ ఎరువుల విక్రయాలను సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రారంభించింది సోమిరెడ్డి కాదా అని ప్రశ్నించారు. నీరు-చెట్టు, వనం-మనం పథకాలతోపాటు ఇసుక, మట్టి, సిలికా, మిల్లర్లు ఇలా అన్ని విధాలుగా దోపిడీకి పాల్పడ్డారని దుయ్యబట్టారు. సమావేశంలో తోటపల్లి గూడూరు మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిరంజీవిగౌడ్, రమేష్‌రెడ్డి, చెరుకూరి శ్రీనివాసులునాయుడు, మల్లికార్జున, మల్లేశ్వర గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలను తనిఖీ చేసిన కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగరంలోని పలు సచివాలయాలను గురువారం కమిషనర్ వికాస్‌మర్మత్ తనిఖీ చేశారు. నగరంలోని స్థానిక 29/1, 2, 3 సుభాష్‌చంద్రబోస్‌నగర్, మహాత్మాగాంధీనగర్-1, 2 వార్డు సచివాలయాలతోపాటు 41/1 మూలాపేట, రాజీవ్‌గృహకల్ప ప్రాంతం సచివాలయాన్ని కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయంలో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

'కొమెన్' నూతన కార్యవర్గం ఏర్పాటు



నెల్లూరు(బృందావనం): జిల్లా సినీ ఆర్కెస్ట్రా మ్యూజిషియన్స్ అసోసియేషన్ ఆఫ్ నెల్లూరు(కొమెన్) నూతన కార్యవర్గ ఎన్నిక పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో గురువారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసచక్రవర్తి, ఉపాధ్యక్షుడిగా శాంతికుమార్, ప్రధాన కార్యదర్శిగా గీత, సంయుక్త కార్యదర్శిగా నవీన్, కోశాధికారిగా కృష్ణమోహన్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడు శ్రీనివాసచక్రవర్తి మాట్లాడుతూ జిల్లాలో సినీ ఆర్కెస్ట్రా మ్యూజిషియన్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం సీనియర్ కళాకారుడు పాటూరి శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు.

'జగనన్న సురక్ష'తో సంక్షేమం చేరువ

- దరఖాస్తుదారులకు 15,679 ధ్రువీకరణ పత్రాల అందజేత
- అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు పొందేలా అవకాశం కల్పించిన ప్రభుత్వం



పొట్టేపాళెంలో మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పక్కన నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)



➡ ఈ ఫొటోలోని గిరిజన మహిళ పేరు కడియాల పోలమ్మ. నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెంలోని దమయంతమ్మ కాలనీలో నివసిస్తోంది. ఈమె భర్త సంజీవయ్య మరణించాడు. ఈమె ఇద్దరు కుమార్తెల్లో ఒక కుమార్తెకు వివాహమై మరో ప్రాంతంలో నివసిస్తుండగా మరో కుమార్తె వద్ద కాలం వెళ్లదీస్తోంది. గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. 'జగనన్న సురక్ష'లో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా ఈమెకు ఒంటరి మహిళ రేషన్ కార్డు మంజూరైంది. త్వరలో వృద్ధాప్య పెన్షన్ కూడా పొందేందుకు అవకాశం కలగడంతో సంతోషం వ్యక్తం చేస్తోంది.



➡ ఈ ఫొటోలోని వ్యక్తి పేరు సారంగం రమణయ్య. నెల్లూరు రూరల్ మండలం మాదరాజు గూడూరు గ్రామానికి చెందిన రైతు. గతంలో కుటుంబసభ్యులందరూ కలిసి ఉన్న రేషన్‌కార్డు ఉండడంతో పొలం ఎక్కువ ఉందని చూపి రేషన్‌కార్డు తొలగించారు. రమణయ్య పేరిట నిర్దేశస్థాయికి మించి పొలం లేదని నిర్ధారణ కావడంతో 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ఆయనకు, ఆయన భార్యకు కలిపి రేషన్ కార్డు మంజూరైంది. దీంతో రమణయ్య సంతోషం వ్యక్తం చేశారు.

నెల్లూరు రూరల్ : సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చిందని చెప్పవచ్చు. పలు సాంకేతిక కారణాలు, చిన్న చిన్న సమస్యల వల్ల ప్రభుత్వ పథకాలు అందని అర్హులైన లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఆయా ప్రాంతాల్లోని సచివాలయాల పరిధిలో ప్రజలకు ఉచితంగా అందించింది. నెల్లూరు రూరల్ మండలంలో నెల రోజులపాటు విజయవంతంగా నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో వేలాది మంది లబ్ధిదారులు తమకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను తమ ప్రాంతాల్లోనే అందుకున్నారు. ఇందులో కుల, నివాస, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, బర్త్ (జనన) సర్టిఫికెట్, డెత్ (మరణ) సర్టిఫికెట్, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్స్ (భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్‌ను అనుసరించి పాస్‌పుస్తకాలలో భూమి హక్కులు కల్పించడం), మ్యుటేషన్ ఫర్ కరెక్షన్ (పట్టాదారు పాస్‌పుస్తకంలో సవరణలు చేయడం), మ్యారేజ్ (వివాహం), వివాహం జరిగిన రెండు నెలల లోపు కాలపరిమితిలో ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్ అప్‌డేట్ చేయడం, కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేయడం, కొత్త రేషన్‌కార్డులు, రేషన్ కార్డుల్లో సభ్యుల తొలగింపు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేయడం వంటి సేవలు విస్తృతంగా అందించారు. నియోజకవర్గంలోని లబ్ధిదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం 15,679 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సర్టిఫికెట్లు అందుకున్న ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్రసం.	సచివాలయం	అందించిన ధ్రువీకరణ పత్రాలు
1	ఆమంచర్ల	1,859
2	దేవరపాళెం	768
3	దొంతాలి	536
4	గొల్ల కందుకూరు	1,763
5	కాకుపల్లి బిట్-1	976
6	కందమూరు	969
7	కొండ్లపూడి	1,031
8	మాదరాజుగూడూరు	1,795
9	ములుముడి	2,369
10	పెనుబర్తి	776
11	సౌత్ మోపూరు	1,752
12	వెల్లంటి	1,085
	మొత్తం	15,679

'జగనన్న సురక్ష' ద్వారా విస్తృత సేవలు



నెల్లూరు రూరల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా విస్తృత సేవలు అందించడం జరిగింది. వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేశాం. ఆ ధ్రువీకరణ పత్రాలు సంక్షేమ పథకాలు పొందేందుకు ప్రజలకు ఉపయోగపడుతున్నాయి.

– శైలేంద్రకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ, నెల్లూరు రూరల్

సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం

- నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని 14వ డివిజన్ శ్రీనగర్‌కాలనీ, కిన్నెర అపార్ట్‌మెంట్ వీధి, రాజు టవర్స్ వీధి తదితర ప్రాంతాల్లో ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకుంటున్నామని, పథకాలు అందని వారికి ఏ కారణం వల్ల అందడం లేదో పరిశీలించి అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఏది జరిగినా కొందరు నాయకులు, కొన్ని చానళ్లు, యూట్యూబ్ చానళ్లు పనిగట్టుకుని తనపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా తట్టుకునే శక్తి తనకు ఉందని, భగవంతుడి ఆశీస్సులతోపాటు జగనన్న, నగర ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆశీస్సులు తనకు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగర నియోజకవర్గంలోని 48వ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకులు ఆదూరు ప్రభాకర్, రాజశేఖర్, మునీంద్ర, కోటేశ్వరరెడ్డి, వారి మిత్రబృందం దాదాపు 100 మంది గురువారం ఇస్కాన్‌సిటీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ సమక్షంతో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై స్థానిక డివిజన్ నుంచి టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. వారి చేరికతో డివిజన్ మరింత బలోపేతమవుతుందన్నారు. పార్టీలో చేరిన వారికి సముచితస్థానం కల్పిస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో ఈశ్వర్, చందు, మురళి, పాపయ్య, ఆదినారాయణ, రవి, నారయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ సిద్ధిఖ్, కార్పొరేటర్లు పొట్లూరి రామకృష్ణ ఆచారి, వేలూరు మహేష్, నాయకులు సాదా గోపి, చిత్తాతూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

- కమిషనర్ వికాస్‌మర్మత్



మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): పరిపూర్ణమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ కోరారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా సవరణలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని ఓటర్ల జాబితా రూపొందించడంలో బూత్‌లెవల్ అధికారులు సహకరించాలని తెలిపారు. గత నెల 21 నుంచి బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నారన్నారు. పార్టీలకు చెందిన బూత్‌స్థాయి ఏజెంట్లు వారికి సంపూర్ణంగా సహకరించినట్లయితే కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించగలుగుతామని తెలిపారు. రాజకీయ పార్టీలన్నీ ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్ లెవల్ ఏజెంట్‌లను నియమించుకోవాలని సూచించారు. బీఎల్‌ఓలు ఈ నెల 21వ తేదీ వరకు ఇంటింటికీ తిరిగి ముందస్తు ఓటర్ల జాబితా ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. ఒకే ఇంటికి సంబంధించిన కుటుంబసభ్యుల ఓట్లు వేర్వేరు పోలింగ్ బూత్‌లో కాకుండా ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా జాబితాలో మార్పులు చేర్పులు చేస్తున్నామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మల్లికార్జున, టీడీపీ ప్రతినిధి భువనేశ్వర్ ప్రసాద్, బీఎస్పీ ప్రతినిధి శ్రీరామ్, సీపీఐ ప్రతినిధి షానవాజ్, సిరాజ్, తహసీల్దార్ నిర్మలానందబాబా, డీసీపీ దేవీకుమారి, ఈడీటీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

- అక్రమ రవాణాపై విజిలెన్స్ దాడి

నెల్లూరు(క్రైమ్): పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి సీఎస్‌డీటీ కె.చంద్రలీల గురువారం తమ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పడారుపల్లి గవర్నమెంట్ హాస్పిటల్ సమీపంలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 23 బస్తాలు (1,150 కేజీల) పీడీఎస్ బియ్యాన్ని, ఆటోను సీజ్ చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని కొత్తూరులోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో అప్పగించారు. ఆటో యజమాని రమణయ్య, ఆటోడ్రైవర్ శ్రీనివాసులుపై 6ఏ కేసు నమోదు చేశారు. నిందితుడు రమణయ్య పడారుపల్లి సమీప ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు గుర్తించారు. నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్‌డీటీ చంద్రలీల వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

నెల్లూరు(క్రైమ్): నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగేశ్వరమ్మను రేంజ్ వీఆర్‌కు బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎ.శివాజీని నియమించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా సంస్థ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ రెండో రోజు గురువారం కూడా విద్యుత్ భవన్ వద్ద రిలే దీక్షలు నిర్వహించింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన కోర్కెల సాధన కోసం గత నెల నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, నాయకులు లతీఫ్, సతీష్, పెంచలనాయుడు, సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, దొరస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం

నెల్లూరు(బృందావనం): నగరంలో రైల్వేఫీడర్స్ రోడ్డులో ఉన్న దేవదాయ, ధర్మదాయశాఖకు చెందిన శ్రీమొగళ్లపల్లి వెంకటసుబ్బయ్య శెట్టి సత్రం 8 షాపుల లీజుకు సంబంధించి బహిరంగ వేలం గురువారం నిర్వహించారు. ఇందుకు సంబంధించి ఆ సత్రం కార్యనిర్వహణాధికారి జీసీహెచ్ దర్గయ్య మాట్లాడుతూ ఈ ఏడాది నిర్వహించిన షాపుల లీజుకు జరిగిన బహిరంగ వేలం పాట ద్వారా దేవదాయ, ధర్మాదాయశాఖకు రూ.1.15 లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. కార్యనిర్వహణాధికారులు జి.రామకృష్ణ, చిట్టిబాబు,ఎ.వేణుగోపాల, కె.పెంచలవరప్రసాద్, రాధాకృష్ణ, కె.మస్తాన్‌బాబు పాల్గొన్నారు.

రొట్టెల పండగను విజయవంతంగా నిర్వహించాం



నెల్లూరు(బారకాసు): రొట్టెల పండగ అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించామని వైఎస్సార్‌సీపీ ముస్లీం నేత సమీర్‌ఖాన్ తెలిపారు. నగరంలోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది దాదాపు 15 లక్షల మంది భక్తులు దర్గాను దర్శించుకున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పటిష్టమైన చర్యలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దర్గా ఫెస్టివల్ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్‌ఖాదరి మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు తమకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యురాలు మోబినా, వైఎస్సార్‌సీపీ 34వ డివిజన్ ఇన్‌చార్జి రియాజ్, రఫీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

నెల్లూరు రూరల్ : తల్లిపాలపై మహిళలకు అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని అంబాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని, నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం తగదని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నమ్మ, రమాదేవి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

చలో తిరుపతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కస్తున్న యూనియన్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ(ఏపీవీటీయూఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న చలో తిరుపతి సీఎండీ కార్యాలయం పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, నగర అధ్యక్షుడు సూరిబాబు, హరినారాయణ పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7వ తేదీన తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మీనరసయ్య, కృష్ణ, నాగయ్య, ఆరీఫ్, శ్రీను, రవి, శ్రీనివాసులు, రసూల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


హెల్మెట్ విధిగా ధరించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ

నెల్లూరు(క్రైమ్): ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్‌లు పీవీ నారాయణ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ట్రాఫిక్, పోలీసు అధికారులు గురువారం రాత్రి నెల్లూరు నగరంలో హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం మంది తలకు తీవ్రగాయాలై మృతిచెందుతున్నారని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను రక్షించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని, మద్యం మత్తులో మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి గిరిజనుల పక్షపాతి



నెల్లూరు(దర్గామిట్ట): గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల పక్షపాతిగా తమ గుండెల్లో నిలిచిపోయారని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి అన్నారు. గురువారం నెల్లూరులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన పల్లెబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గంలోని గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం గిరిజన పల్లెబాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నెల రోజులపాటు 27 డివిజన్లలో 18 గ్రామ పంచాయతీల్లో గిరిజనుల సమస్యలను గుర్తించి ఆదాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచనలతో జిల్లా అంతటా గిరిజన పల్లెబాట కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వర్ణ ప్రసాద్, జగన్నాథం శీను, గున్నము రాహుల్, చల్లా మాధవి, అరవ కామాక్షి, అల్లాడి అశోక్‌దాస్, ఎంపీటీసీ సభ్యులు ఉదయ్ భాస్కర్, రమేష్, లోకసాయి రాము, అరవ వల్లి, వేలూరు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5న చంద్రబాబు పర్యటనపై సమీక్ష

నెల్లూరు సిటీ: నెల్లూరులో ఈ నెల 5వ తేదీన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పర్యటనపై ఆ పార్టీ జిల్లా నాయకులు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.

పేకాట స్థావరంపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఇళ్ల మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 10 మంది జూదరులను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నిప్పోసెంటర్‌కు చెందిన సంజీవయ్యనాయుడు శ్రామికనగర్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని గత కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా పేకాట స్థావరం నిర్వహిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ గురువారం తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిర్వాహకుడితోపాటు 9 మంది జూదరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.31,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.